క్లుప్తంగా

మహిళపై దాడి.. ఆరుగురిపై కేసు

చిత్తూరు అర్బన్: ఇంటి విషయమై మహిళపై దాడి చేసినందుకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన దీప ఇంట్లో ఉండగా శనివారం ఆమె సోదరులు, వారి సతీమణి వచ్చి ఇంట్లో తమకు భాగం ఉందని.. ఇంటిని ఖాళీ చేయాలని గొడవ చేశారు. ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి, తనపై తన సోదరులు, వారి భార్యలు దాడి చేసి, గాయపరిచారని దీప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆవిష్కరణలపై శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జిల్లా స్థాయి నేషనల్ సైన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యార్థులు ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఏపీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు కృత్రిమ ప్రయోగాలపై కాకుండా ఆలోచనతో ఆవిష్కరణలను కనిపెట్టాలన్నారు. సైన్సు టీచర్లు విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం పలు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అరుణ్‌కుమార్, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

ఐరాల: పంట పొలాలపై రెండు ఏనుగులు దాడి చేసి తీవ్ర నష్టం కలిగించాయి. శుక్రవారం అర్ధరాత్రి రెండు ఏనుగులు అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన 35 యర్లంపల్లె, దివిటివారిపల్లె గ్రామాల్లో పంట పొలాలపై బీభత్సం సృష్టించాయి. దివిటివారిపల్లెకు చెందిన మునికృష్ణ, రెడ్డెప్పకు చెందిన 5 గుంటల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. 35 యర్లంపల్లెకు చెందిన రైతు రవికుమార్‌రెడ్డి పది గుంటల వరి పంటను ధ్వంసం చేశాయి. మరో రైతు సుబ్రమణ్యంయాదవ్‌కు చెందిన మామిడి, సపోట, అరటి చెట్లను విరిచేశాయి. మామిడి తోటకు ఏర్పాటు చేసిన ఇనుప గేటును ధ్వంసం చేసి రాతికూసాలను కూలదోశాయి. సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఫారెస్టు బీట్ అధికారి రెడ్డిప్రసాద్ ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు. బాణసంచా పేల్చి రెండు ఏనుగులను తవణంపల్లె మండలం సరకల్లు బీసీ కాలనీ అటవీ ప్రాంతం వైపు తరిమివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు ఏనుగులు అక్కడే తిష్టవేసినట్లు చెప్పారు.

బోరు మోటారు వైరు చోరీ



తవణంపల్లె: మండలంలోని కొత్తగోనెపల్లె సమీపంలో వ్యవసాయ భూముల్లో బోరు మోటారుకు అమర్చిన కేబుల్ వైర్లు శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. బాధితుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని కొత్తగోనెపల్లెకు చెందిన రైతులు సిద్దయ్య, శ్రీనివాసులు రెడ్డి, గోపీనాథ రెడ్డి, దేవరాజులు, మోహన్ రెడ్డి పొలాల్లో ఉన్న బోరు మోటారుకు అమర్చిన కేబుల్ వైర్లు సుమారు 60 మీటర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకొని అపహరించుకెళ్లారు. శనివారం ఉదయం రైతులు పొలం వద్దకు వెళ్లి బోరు వద్ద గమనించగా కేబుల్ వైర్లు కత్తిరించి కపోవడంతో లబోదిబోమంటూ ఆందోళన చెందారు. పోలీసులు నిఘా ఉంచి దొంగతనాలను అరికట్టాలని బాధితులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. మండలంలోని పేయన్నగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



తవణంపల్లె: ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది



ఐరాల: అగరంపల్లె హైస్కూల్ ప్రాంగణంలో పోటీలకు సిద్ధమవుతున్న మహిళా ఉద్యోగులు, మహిళలు



చిత్తూరు: మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

రాణిస్తేనే సాధికారత

- ఘనంగా మహిళా దినోత్సవం
- మహిళలకు పలు రకాల పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

చిత్తూరు కార్పొరేషన్: మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణిస్తేనే సాధికారత సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని ట్రాన్స్‌కో అతిథిగృహంలో చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల మహిళ ఉద్యోగులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ సతీమణి మల్లిక బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఉద్యోగులందరినీ సన్మానించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ లలితను కార్యదర్శి శర్మ సత్కరించారు. నగరంలోని ఓ మండపంలో నిర్వహించిన వేడుకల్లో ఏపీ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్‌డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి కార్పొరేటర్ పుష్పలత పాల్గొన్నారు.

రాణిస్తున్న మహిళలకు సత్కారం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మహిళా సదస్సు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దీనావతి అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. సంతపేటలోని బృందావన్ సీబీఎస్ఈ పాఠశాల చైర్మన్ శైలజాకుమారి పలువురు మహిళా టీచర్లను సత్కరించారు.

జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ జయంతి మాట్లాడారు. మాట్లాడారు. అనంతరం ఇటీవల విరమణ పొందిన మహిళా ఉద్యోగులను సత్కరించారు .

జిల్లా కేంద్రంలోని ఎన్జీవో కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు ఇరిగేషన్ శాఖ ఏఈఈ ధనలక్ష్మి, డిగ్రీ కళాశాల లెక్చరర్ శ్రీవంతి తదితర మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ఐరాల: మండలంలోని అగరంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీడీఓ ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. చిగరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి, జిల్లా మహిళా విభాగం ఏపీజీఈఏ అధ్యక్షురాలు భాగ్యమేరీ మాట్లాడారు. విద్యార్థులకు, మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి లలిత, కోశాధికారి శైలజ, జిల్లా కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో, సెయింట్ స్టీఫెన్ పబ్లిక్ స్కూల్‌లో చైర్మన్ థియోస్టీఫెన్ జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడా రంగంలో పతకాలు సాధించిన గణేష్, కాంచనను ఘనంగా సన్మానించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

సీఎస్ఆర్ కళాశాలలో ..

గుడిపాల: స్థానిక సీఎస్ఆర్ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రిన్సిపల్ రామచంద్ర, పాఠశాల హెచ్ఎం సుధారాణి పాల్గొన్నారు. పోటీల్లోల విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తవణంపల్లె: మహిళలు అన్ని రంగాల్లో రాణించి మహిళా సాధికారత సాధించాలని పశుసంవర్ధక ఏడీ డాక్టర్ మురళీమోహన్ అన్నారు. వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలో వెటర్నరీ డాక్టర్లు లావణ్య, డాక్టర్ పల్లవి, డాక్టర్ రూన్సీ,సిబ్బంది మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీఓ కార్యాలయంలో కేక్‌కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు.

మాతృభాషతోపాటు ఇతర భాషలు నేర్చుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : మాతృభాషను మరవకుండా ఇతర భాషలను సైతం నేర్చుకోవాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల 43వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ మాతృభాషను మరువకూడదన్నారు. మహిళలు ఎక్కడ గౌరవింపబడుతారో ఆ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కళాశాల సీపీడీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే శ్రీ వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ కళాశాలకు గొప్ప మహిళా నాయకులను ఆహ్వానించడం షంతోషకరమన్నారు. మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ మాట్లాడుతూ స్త్రీ తన నైపుణ్యంతో కుటుంబాన్ని ముందంజ వేయిస్తుందన్నారు. అనంతరం కళాశాలలోని 9 గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దివంగత సంధ్య శ్రీరామ అందించే సావిత్రమ్మ గోల్డ్ మెడల్స్‌ను అందించారు. పురంధేశ్వరి చేతుల మీదుగా 19మంది విద్యార్థినులకు రూ.లక్ష చొప్పున ఉపకారవేతనం, గోల్డ్ మెడల్స్ అందించారు. కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, అధ్యాపకులు ఉషారాణి, తిరుకుమరన్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సన్నిధిలో ఎంపీ పురంధేశ్వరి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం ఎంపీ పురంధేశ్వరి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు.



చిత్తూరు: గోల్డ్‌మెడల్స్ అందుకున్న సావిత్రమ్మ కళాశాల విద్యార్థినులు



ఐరాల: క్రీడాకారిణి కాంచనను సన్మానిస్తున్న ఎస్ఐ నరసింహులు



చిత్తూరు: మహిళా దినోత్సవంలో ఎస్పీడీసీఎల్ ఉద్యోగినులు



చిత్తూరు: బృందావన్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



చిత్తూరు: యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో వేడుకలు



చిత్తూరు : రెవెన్యూ భవనంలో విరమణ పొందిన మహిళా ఉద్యోగినులను సత్కరిస్తున్న నిర్వాహకులు



ఐరాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి



తవణంపల్లె : మ్యూజికల్ చైర్ పోటీలో వెటర్నరీ అధికారులు



తవణంపల్లె : విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మురళీమోహన్



గుడిపాల: మహిళా దినోత్సవంలో విద్యార్థినులు



తవణంపల్లె : వెటర్నరీ ఆస్పత్రిలో మొక్క నాటి నీరు పోస్తున్న వెటర్నరీ డాక్టర్లు లావణ్య, పల్లవి, రూన్సీ

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయి. విద్యార్థినులు ఉన్నత చదువుతో ఉజ్వల భవితకు బాటలు వేసుకుంటున్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను గౌరవిస్తూ, స్వతంత్ర భావాలతో ముందుకు సాగుతున్నారు. సమాజంలో ప్రత్యేకతను చాటుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. మహిళా దినోత్సవం రోజు నగరంలోని పలు వేదికలపై నిర్వహించిన కార్యక్రమల్లో వక్తలు పలికిన పలుకులివి.

భానుడి ప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం

మార్చి ఆరంభంలోనే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. భానుడు ప్రతాపంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్న సమయంలో పల్లెటూళ్లలో కూడా ప్రజలెవరూ బయటకు రావడానికి జంకుతున్నారు. ఇక రాబోయే రోజుల్లో మండే ఎండల పరిస్థితి తలచుకుని జనం వణికిపోతున్నారు. మరోవైపు రాత్రి పూట మాత్రం మంచు పడుతూ, చలి వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ వైద్యులు పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు.

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- రాత్రిపూట మాత్రం తగ్గని చలి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

ఐరాల: రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. 20 రోజుల క్రితం 30 డిగ్రీలు నమోదైన ఎండలు వారం రోజుల నుంచి 36 డిగ్రీలకు చేరుకున్నాయి. ప్రజలు మండుటెండలకు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం పూట ఎక్కడ నీడ దొరికితే అక్కడ సేద తీరుతున్నారు. అయితే రాత్రి పూట చలిగా ఉండడంతో కాస్త భిన్న వాతావరణం కనిపిస్తోంది. వేసవిలో మార్చి నెల నుంచే ఎండలు దంచికొడుతుండడంతో ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతి రోజూ 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో వివిధ పనులకు వెళ్లే వారితో పాటు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం 10 గంటలు దాటగానే భానుడు భగభగ మండిపోతుండడంతో జనం బయటకు రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో చిరువ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతోంది. మే లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

11 గంటలకే పనులు ముగించుకోవాలి

ప్రస్తుత పరిస్థితుల్లో బయటకు వెళ్లిన వారు తప్పకుండా 11 గంటల్లోపు తిరిగి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. సాయంత్రం 5 గంటల తరువాత బయటకు వెళ్లవచ్చని చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులను ఎండల తీవ్రత ఉన్న సమయంలో బయటకు పంపవద్దని అంటున్నారు.



ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ఐరాలలోని బజారువీధి

పండ్ల రసాలే ఆరోగ్యానికి శ్రేయస్కరం

ఎండా కాలంలో అధికంగా మంచినీటిని తాగాలి. వీటితో పాటు కొబ్బరి నీరు, పండ్ల రసాలు(ఐస్ లేకుండా) తాగితే మంచిది. సాధారణంగా రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీటిని తాగవచ్చు. వేసవి కాలంలో 5 నుంచి 7 లీటర్ల నీటిని తీసుకోవాలి. వీలైనంత వరకు రిఫ్రిజిరేటర్ నీటిని తక్కువగా తీసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఈ వేసవిలో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి త్వరగా జీర్ణమయ్యే పదార్థాలను తీసుకోవాలి.

కాటన్ దుస్తులతో ఆరోగ్యం

కాటన్ దుస్తులు ధరించాలి. అవి కూడా లేత రంగులో ఉండే దుస్తులైతే ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. శరీరానికి వదులుగా ఉండే దుస్తులు ధరించడం వలన గాలి తగిలి చెమట తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ముదురుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పనులకు బయటకు వెళ్లే కూలీలకు ఆయా వైద్య సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నాం. ప్రజలు తప్పకుండా మంచి నీరు అధికంగా తీసుకోవాలి. వడదెబ్బకు గురైతే ముందుగా వారిని నీడ ప్రదేశాల్లోకి తీసుకెళ్లి నీరు తాగించాలి. అందుబాటులో ఉండే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. ఈ ఎండల దృష్ట్యా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు, మరిన్ని మందులను అందుబాటులో ఉంచాం.

–ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

చీడపీడల నుంచి రక్షించుకోవాలి



మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వాతావరణం పొడిగా ఉండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున మామిడిలో చీడపీడలు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయని, ఇలాంటి తరుణంలో మామిడి రైతులు జాగ్రత్త పడాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా నల్ల తామర పురుగులు (త్రిప్స్) తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి, పూలు, పూతకాడలు, లేత పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయన్నారు. పూత మాడుతుందని, పిందెలు రావని చెప్పారు. ఈ పురుగులు ఆశించిన మామిడి తోటల్లో పూత పూర్తిగా రాలిపోతుందని వివరించారు. పూత పిందె సమయంలో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. నష్ట నివారణకు మొదటి పిచికారిలో ఎక్సపోనస్ 34 మి.లీ. మందు, 140 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి కొనసాగితే 15–20 రోజుల తర్వాత ట్రేసర్ 0.4 మి.లీ మందు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసిన సమర్థవంతంగా నివారించవచ్చని చెప్పారు. జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా బవేరియా బాసియానా, లోకల్ స్ట్రెయిన్ ను 5 గ్రాములు ఒక లీటరు నీటి కలిపి పిచికారి చేసినా... భవిష్యత్తులో తామర పురుగులను సమర్ధవంతంగా నివారించవచ్చునన్నారు. మరింత సమాచారానికి సమీపంలోని ఉద్యాన అధికారిని సంప్రదించాలని ఆయన సూచించారు.